International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.9, Issue-1, January, 2022
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

# పదకవితా పితామహుడు అన్నమయ్య

**శ్రీమతి వెంకటలక్ష్మి చెరుకూరి**
ఎస్.ఏ తెలుగు,
జడ్.పి.హెచ్.ఎస్, గౌరీపట్నం,
చరవాణి : 9494158446
Mail id : lakshmicherukuri46@gmail.com

కొంత మంది వ్యక్తులు తమ రచనల ద్వారా సమాజాన్ని ప్రభావితం చేసి మంచి మార్గంలో నడిపించడానికి ప్రయత్నిస్తారు. ప్రజా జీవనంలోని అంతరాలను సరిచేసి వారిని సరైన మార్గంలో నడిపించడానికి వారి రచనలు బాటలు వేస్తాయి. అలా ప్రజా జీవనానికి ఉపయోపడే, సమసమాజ నిర్మాణానికి వారధులుగా కొంతమంది సాహిత్యాన్ని ఉపయోగించారు. వారి రచనల ద్వారా సమ సమాజ నిర్మాణానికి బాటలు వేశారు. వారి రచనలతో విశ్వ మానవ కళ్యాణానికి పూనుకున్నారు వారిలో వాగ్గేయకారుల పాత్ర అనన్య సామాన్యమైనది. అన్నమయ్య, త్యాగయ్య, క్షేత్రయ్య, కృష్ణమాచార్యులు, రామదాసు, సారంగపాణి, పెదతిరుమలాచార్యులు, చినతిరుమలాచార్యులు, నారాయణ సూరి లాంటివారు సమాజంపై తమదైన ముద్రవేశారు, ప్రజాజీవనాన్ని ప్రభావితం చేశారు, భక్తిని ఒక మార్గంగా చేసుకుని సమాజంలోని వ్యక్తులకు చేరువైన భాషలో భక్తి, నీతి, వైరాగ్య మార్గాలను జానపదబాణీలతో అందిరికీ తెలిసిన భాషలో జాతీయాలు, సామెతలు, సూక్తులను వారి రచనలలో చొప్పిస్తూ మానవ సమాజజీవనానికి అవసరమైన రచనలు చేసారు.

ఈ వాగ్గేయకారులు తెలుగు వాగ్గేయకారులలో మొట్టమొదటిగా గుర్తుకు వచ్చేవారు అన్నమయ్య. కడప జిల్లా, రాజంపేట కతాలూకా, తాళ్ళపాక గ్రామంలో నారాయణ సూరి లక్కమాంబ దంపతులకు క్రీస్తుశకం 1408లో అన్నమయ్య జన్మించారు. వేంకటేశ్వరుని సాక్షాత్కారం పొందిన పద కవితా పితామహుడు అన్నమయ్య. మొత్తం 32,000 సంకీర్తనలు రచించినా 12,000 మాత్రమే దొరుకుతున్నాయి. అన్నమయ్య సంకీర్తన లక్షణము అనే గ్రంథాన్ని రచించారు. వ్యవహారిక భాషాపదాలను విరివిగా వాడి మొదటిగా అటువంటి భాషకుబహుళ ప్రయోగార్హతను కల్పించిన వాడు అన్నమయ్య . దైవభక్తిని మాత్రమే కాక కులమత బేధాలను రూపుమాపి సమసమాజ నిర్మాణం చేయడానికి కీర్తనలను ఆయుధంగా చేసుకున్నాడు ఈ వాగ్గేయకారుడు. అన్నమయ్య పెరిగిన పరిసరాలు నూటికి నూరుపాళ్ళు జనపదాలు. అందుకే ఆయన రచనలు జానపద బాణీలతో, అందరికి అర్థమయ్యేలా ఉంటాయి. వాగ్గేయకారుడు అంటే ఎవరు "వాచం గేయంచ కురుతే య: స వాగ్గేయకార:" వాగ్గేయకారుని రచన ధాతు, మాతువుల సంయోగం కలది. ధాతువు అంటే సంగీతం, మాతువు అంటే సాహిత్యం. ఒక మాటలో చెప్పాలంటే ఎవరు స్వయంగా గీతరచన చేసి

స్వరాలు కూర్చి గానం చేస్తారో వారే వాగ్గేయకారులు. ఆనాడే కులతత్వాన్ని ప్రశ్నించి కులమత బేధాలు మనుషులకే గానీ, మనుషులను సృష్టించిన వాడికి, పంచభూతములకు లేవని కులతత్వాన్ని ఘాటుగా నిరసిస్తూ సందేశాత్మక కీర్తనలు వ్రాశారు.

"చండాలుడుండే సరి భూమి ఒకటే
మెండైన బ్రాహ్మణుడు మెట్టు భూమి ఒకటే
ఏ కులజుడైన నేమి ఎవడైనా నేమి
ఆకడనాతడే హరినెరిగిన వాడు
విజాతులన్నియు వృథా వృథా
అజామీళాదులదరియేజాతి"

లాంటి కీర్తనలతో కులమత బేధాలను నిరసించాడు.

ప్రజలను దైహిక లంపటాల నుంచి విముక్తి చేసి, దైవచింతన కలిగించి సన్మార్గంలో నడిపించుట ద్వారా సమ సమాజ స్థాపనకు దోహదం చేశాడు. ఎప్పుడైతే మనిషి సాటి మనిషి పట్ల సానుభూతి, ప్రేమ, అభిమానం, ఆత్మీయతలను చూపుతాడో అప్పుడే విశ్వ మానవ సౌభ్రాతృత్వం సాధ్యమని తెలిపిన గొప్ప పద కవితా పితామహుడు అన్నమయ్య. ప్రజలను భక్తి మార్గంలో ఓలలాడించడంలో అన్నమయ్యకు అన్నమయ్యే సాటి.

"అదివో అల్లదివో శ్రీహరివాసము
కొండలలో నెలకొన్న కోనేటి రాయుడు వాడు...
బ్రహ్మ కడిగిన పాదము"...వంటి సంకీర్తనలు రాశాడు.

ఈయనే వేంకటేశ్వరుని పరమ భక్తాగ్రేసరుడు. నిరంతరం హరిభక్తితో ఓలలాడేవాడు. అతని భక్తి తత్వం కేవలం ఛాందసమైనది కాదు, జీవన తత్వాన్ని వివరించే భక్తి అది. సామాజిక రుగ్మతల మీద విమర్శతో కూడిన భక్తి భావాన్ని ప్రదర్శించాడు.

కుటుంబంలో పెద్ద ఒకరు ఆచరించి చూసిన మార్గాన్ని పిల్లలు అనుసరిస్తారు అని అది మంచైనా, చెడైనా అని చెప్పడానికి

"విత్తొకటి పెట్టితేను...వేరొకటి మొలచునో"....

అని పెద్దల వలెనే పిల్లలు ప్రవర్తిస్తారని చెప్పారు. ధనం మీద అత్యాశ పనికి రాదని దానివల్ల ఎన్నో అనర్ధాలు వస్తాయి అని మరింత లోభిత్వం పెరుగుతుందని తెలుపుతూ

"ధనమెంత కలిగెనది దట్టమౌలోభంబు" అన్నారు.

మానవుడు దుర్మార్గాలు చేస్తూ భగవంతుని విధివిలాసమని అతనిపై భారము వేయడం అవివేకమని ఈ క్రింది పద్యం ద్వారా సూచించారు. గ్రామీణ వాతావరణం ప్రజల ఆచార వ్యవహారాలను

ప్రజల దురాశ దుర్బుద్ధులను చక్కగా వివరించి కనువిప్పు కలిగించాడు. సమాజంలో ధర్మాన్ని, మానవతనీ స్థాపించడానికి సాంఘిక చైతన్యం కలిగించడానికి కూడా కీర్తనలు రచించారు.

"చేతులారా చేసేటి చేకొన్న కర్మానకు
ఘాతల కర్తగానంటే కట్టు పడదు
జాతిదేహము మోచిన సహజమింతే" అని తెలిపాడు.

దుర్మార్గుణ్ణి, మూర్ఖుణ్ణి మార్చడం చాలా కష్టమని ఈ క్రింది కీర్తన ద్వారా తెలియజేసాడు.

"భారమైన వేపమాను పాలు పోసి పెంచినాను
తీరని చేదే గాక తీయనుండేనా
పాయదీసి కుక్క తోక బద్దలు పెట్టి బిగిసి
బాయకెంత గట్టినాను చక్కనుండేనా"

అన్నమయ్య సమతావాది. ఆనాటి గొప్ప సంస్కర్తలా కనిపిస్తాడు. స్త్రీ పురుషులు ఇద్దరూ ఒకటేనని, భేద భావం తగదని హితవు పలుకుతాడు.

"పొలతులు జీవులే పురుషులు జీవులే
తలపు భావ భేదములే కాని
బలిమి స్వతంత్రము పరతంత్రమొకరికి
ఎలమి నిందులో చెల్లే హీనాధికములే"

అన్నమయ్య సాహిత్యం 15వ శతాబ్దానికి చెందినప్పటికీ 21వ శతాబ్దంలో ప్రసిద్ధి వహించిన వాదాలకు నినాదాలకు కూడా అందులో వేర్లు కనిపిస్తాయి. మానవుని ఆలోచనలు కాలానికి అతీతమైనవి.

ఏ కాలంలోనైనా అవి అనుసరణీయాలు అని భావించేందుకు అన్నమయ్య సాహిత్యం ఉపకరిస్తుంది. మానవ జీవన విధానంలో ఎన్ని మార్పులు చోటుచేసుకున్న మారని అంశాలు కొన్ని ఉన్నాయి. అవే మౌలిక విలువలు, మానవీయవిలువలు. నిత్య నూతన చైతన్య స్రవంతి అయినా తాళ్ళపాక సంకీర్తనా ధార నేల నాలుగు చెరుగులా దేదీప్యమానంగా జాజ్వల్యమానంగా ప్రకాశిస్తుంది. అన్నమయ్య సంకీర్తనలను అర్థం చేసుకుని అనుసరిస్తే సమ సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది.

**ఆధారగ్రంథాలు :**

1. అన్నమాచార్య సంకీర్తనలు – తి.తి.దే.ప్రచురణలు
2. ఆధునికాంధ్ర గేయ కవిత్వం – డాక్టర్.జి.చెన్నకేశవరెడ్డి
3. తెలుగు సాహిత్య చరిత్ర – డాక్టర్.ద్వా.నా.శాస్త్రి